# పంచసాయకం

ఆ మాట వినేటప్పటికి—నాకు ఎక్కడ లేని నవ్వూ వచ్చింది.

తాను, మీగడ తరక లంటుకున్న మీసాలు దువ్వుకుంటూ చేసిన వ్యాఖ్యానానికి, నేను కూడా హర్షించుతున్నానని ఆ ఆసామి యింకా సకిలిస్తూనే వున్నాడు.

పొగలు వెళ్ళే కాఫీ, హాలంతా మారు మోగేటట్టుగా జుర్రుతూ, అనవసరంగా అయ్యరును "ఏడయ్యా! ఆయన కనపడడేం?" అని అడిగాడు. అరవ సోవరునికి అది అర్థంకాక, ఆ సందడిలో, నోరు తెరిపిలేక "ఎవరు" అని గాలిలో తల త్రిప్పుతో ప్రశ్న చుట్టాడు. "ఆయ నయ్యా-పంతులు" అని వివరించాడు ఆ కాఫీ-పాయి. విని, కొంచెం వికటంగా పెదవి విరిచాడు అయ్యరు. ఆ చేదు మ్రింగి, ఆసామీ....హాలులో అప్పుడున్న వారందరికీ ఆ హాలహాలంలో పాలు పంచడం చూస్తూ—

అప్పుడు-నేను ఫక్కున నవ్వింది.

అందులో వున్న వెన్నెల ఆ అంధుల కళ్ళపడదు-అందుకని కాదు - నేను నవ్వడం: అతని మాటలు తలచుకుని—

అతడు-ఎవరో అందరికీ తెలియవలసిన అగత్యం ఏముంది? "పంతులా" అని పిలిస్తే "ఆఁ" అని మారు పలికి అడగటం తడవుగా అమృత తుల్యమైన కాఫీ తయారుచేసి యిస్తూన్నప్పుడు.

అసహ్యంగా వుంటాడూ - తలమాసి గడ్డం పెరిగి?—అయితే మాత్రం ఏం ?

అతి కటువుగా మాటాడుతాడూ ?-అందుకనే నాకు అతనితో అంత స్నేహం అయింది.

అవాళ పంతులు కనబడలేదు-అడిగితే, అయిదు నిమిషాలు నసిగి కాని అయ్యరు అసలు సంగతి చెప్పలేదు.

—అ వార్డులో....అటు వైపునుంచి డాక్టరు అప్పుడే వస్తున్నాడు. అక్కడే ఎదురుపడి—ఎవరో సిస్టరు నన్ను అతడున్న చోటికి తీసుకు వెళ్ళింది.

"ఏం తమ్ముడూ ?" —నేను - అతడంత చనువు తీసుకున్నా ఏమీ అనుకోలేదు.

"పంతులూ-ఇవాళ కాఫీ ఏమీ బాగుండలేదు."

"అవును బాబూ-అందరూ, పంచదార ఎక్కువ కలుపుతారు, చేదు వస్తుంది." ఆ మాటలూ అర్థంకాలేదు అప్పుడు. అతడు ఎందు కలా కళ్ళతో నవ్వుతున్నాడో అసలు తెలియలేదు.

"అదికాదు భాయీ—తమాషా చూడు—వెనుక, చాలా సంవత్సరాలక్రితం, పంతులుకు ఇలాగే, పవళింపు సేవ జరిగినప్పుడు—బ్రహ్మాండ వైభవం! ఎలా వున్నానో కనుక్కొని పోదామని, గడియ కొకసారైనా అధమం, గాజుల జత నా ముందు గలగలలాడేది....మళ్ళా ఇన్నాళ్ళకు తలవని తలంపుగా మనకు ఈ స్థితి సమకూరడం....చూడటానికి మగవాడా రావడం····అందుకు నవ్వు వచ్చింది—"

—కొంచెం ఆయాస పడ్డాడు. లోపల నెత్తురు కమ్మి నుదుటిమీద మచ్చలు ఎర్రవాగు తేలినవి. కళ్ళు మూసుకుని రవంత సేపు ఊరుకుని, మళ్ళా అందుకున్నాడు.

"ఎవరూ లేరు. కావలసినది కూడా ఏమీ లేదు – నేను ఏమయితే మాత్రం ఏం...."

తలవేపున వున్న చార్టువంక చూశాను, మళ్ళా ఉష్ణం పెరిగే వేళ అయిందేమోనని....

"అదంతా ఆస్పత్రి వాళ్ళ హంగామా కాని....ఆ గీతల ప్రకారం ఎక్కి దిగుతుం దంటావా?-మన గీత వాళ్ళకు ఏం తెలుసూ, అనుభవించిన నాకే అర్థం కానప్పుడు—"

"మెదలకుండా పడుకో, విశ్రాంతిగా. మళ్ళా రేపు వస్తాను."

"మళ్ళా నీవు రావలసిన అవసరం వుండదులే. నన్ను మాట్లాడనియ్యి. మాటలన్నీ విని – మనసులో ఏమన్నా అనుకో – "నలుగురు కూర్చుని నవ్వే

టప్పుడు నా పేరొక పరి తలవండీ" - ఏం ఉలికి పడుతున్నావు? - కాఫీ అందిచ్చే అంత క్రింద మెట్టుమీద ఉన్న జీవికి....కావ్యాలాపాలేమిటనా........ ఏమో ఊహించుకో.

"ఏమిటనా-పోనీలే....చెపుతాను విను:"

"ఎనిమిది ఏళ్ళు నిండీ నిండని పిల్లను....చిన్నప్పుడు నాకు పెళ్ళిచేశారు. ఆ రోజు మొదలనుకో. అంత పసివయసు నుంచే, అమితమైన గౌరవం, అనురాగం కలిగింది- ఆడవాళ్ళ మీద్నాకు.

అప్పచెల్లెళ్ళు ఎవరూ లేరు—మనది వెనకా ముందూ అతి సిప్పచ్చ పుట్టుకలే! అమ్మ నేను భూమి మీదపడినప్పటి నుంచీ లేదు. అలా, తోడూనీ డా లేక పోవడం—ఆ లోపం, ఆ అమ్మాయి వచ్చి తీర్చడానికి పూనుకొన్న తరువాత కాని తెలిసిరాలేదు.

అచ్చమైన చీకటిలో ముద్ద కట్టుకు బిగిసిపోయి వుండి, అదే ఆనందావధి అనుకున్న అమాయకుడికి ఆ పసి వయసుది వెన్నెలకు విలువకట్టడం ఎలాగో నేర్పిం దంపే అంతకుమించే నేర్పరితనం అతి అరుదుకాదా భాయ్!

పదిహేడు ఏళ్ళు దాటకుండానే....నా వెన్నెలంతా పండబారిపోయింది. కలసి మెలసి ఈడుజోడుగా పెరిగాం. కాపురమునకు వచ్చే వయసుకు కరవై పోయింది. కన్నతండ్రి....గుండె నిలుపుకోలేక నన్ను వంటరిగా భూమిమీన వదిలేశాడు.

అందుకు నా కే మాత్రమూ — అంతగా విచారం వేయలేదు - ఎందుచేతనో- కాని, తెగిన గాలిపడగ అలా గాలిలో తేలుతూ పోయి, ఎక్కడ వాలుతుందో — ఏ ముళ్ళ పొదమీదనో—అవును, ఎందుకో తెలియకపోయినా, ఏ పై పునో ఎగురు తూండవలసిందేగా -

మరీ, కవిత్వం అవుతూంది కాదూ, ఓ మెట్టు దిగుతాను. అలా, వంటరిగా ఎవరూ లేకుండా మిగిలానా, ఎంత కాలమో, ఏ జోలికీ పోకుండానే గడిపాను, నెలల పాటు, ఒక్కొక్కతడవ, కాలు గడప దాటనీయకుండా; అవును. అది గొప్ప యింట పుట్టబట్టికాదూ—ఆ అలవాటు-

....అది—క్రమంగా అలవాటైంది. మొదటిసారి, కాలు జారడం మాత్రమే జ్ఞాపకం వున్నది కాని, ఆ విషయంలో అప్పుడు—ప్రజ్ఞకాదు....పరాక్రమం కాదు, జయించుకు వచ్చింది.

జయించింది ఎవరు-నేను కాదు....అలా తీయని మాటలు, ఆ అమ్మాయి లాగానే చూపులు....అందుకోనమని....అందని మానిపండులాగా నటించిన ఆ మేడి పండును అందుకునేందుకు చేయి జాపి....మోసపోయింది....

ఆ తరువాత కూడా....ఆశ పడలేదు. విశేషం....అసహ్యమూ అనిపించ లేదు. అది....ఏం కావాలో తెలియని లోపం....ఇప్పటికీ తెలియడం లేదుటే నిజానికి!

—అప్పుడు గట్టి దెబ్బే తగిలింది, కాని ఆటలో అరటి పండులాగా తోచింది, నా ప్రాణానికి....అదీ అర్థంకాకనే!

—కాశ్మీరం నుంచి, కన్యాకుమారిదాకా....ఆ ఆటే ఆ పాటే....చాలా అన్యాయం కాదూ?—నేను అంటూన్నది సరిగా అర్థమౌతూన్నదా లేదా?....ఇంకా విప్పి చెపుతాను.

నేను ఎంత మాత్రమూ అమాయకుణ్ణికాను—అప్పటికే కాదు, ఇప్పుడు....ఇంత ఆరముగ్గిన తరువాత—

నాకు అర్థంకాకపోవడం నా లోపమే అనుకోవాలా?-చిన్నతనంలో నా సావాస గత్తెగా వుండి....అంతకు మిక్కిలి నాకు కోరిక ఏమీ అలవాటు చేయకుండానే అలా మాయమైపోయిన ఆ అమ్మాయి....అనురాగాన్ని మించి నేను-ఎదుగలేదు.... ఆడ తనం-అంతవరకే నాకు మనసుకు నచ్చేటట్టు అక్కరకు వచ్చింది-అంతకు మించ కుండా-నేను: మించితే-లోకమేను:

ఇంతకు పూర్వమే చెప్పాను కాదూ-"సేతు శీతనగ మధ్యోర్వి" యావత్తూ మన ప్రణయ-జయకాండ, నడచిందని: అతి సైంటిఫిక్‌గా ఆమూలాగ్రం పరిశీలించాను బాబా! ఇంపీరియల్ గెజటీర్....కన్నింగ్ హామ్ పరిశోధనలు జోడించుకుని....అసలు సిసలైన అంగవంగాది యాభై యారు రాజ్యాలు గాలించి చూశాననుకో-ఒక్క పాటలీ పుత్రం మినహా-ముఖ్య రాజధానులన్నిటా ఎక్కని గడప లేదు....పదహారు సంవత్సరాలు ఏకధారగా అయిదు లక్షల రూపాయలు....ఆ అనం దాన్ని పసికట్టడం కోసం హాయిగా ఆహుతి చేశాను....అతిశయోక్తి అనేది....అసలు యీ ప్రబంధంలో ఎక్కడా తగలదని నమ్మాలి—

ఎన్నైనా చెప్పు....ఎన్ని ఆటలన్నా ఆడు....ఎంతెంత చెలగాటానికైనా.... ఏ దేశంలోనైనా ఆ జాతి....సై....కాని అంతతో ఆగిపోతుందా....ఆఖరుకు-అది:

అందుకోసమే యీ రహదారులన్నీ అని అచ్చు పోసేటప్పుడే బ్రహ్మ....అలా మదించాడంటావా నేను నమ్మను....అందుకోసమేనా....కాకపోతే ఆడ జాతంటూ అవసరం లేదా?—

అవసరం తీర్చుకుని - బయటపడి అంతలో మరచి పోవడంలోనే.... అనుభవానికి పరమావధి ఇమిడి వున్నట్టయితే చీకటిలో....తలుపులు మూసుకుని తప్పిదం చేయడానికే నిర్మించిన ఈ జంతుజాలం వెన్నెల అంటే అంత పడి చావడం యెందుకు?

వెన్నెల కోసమేనోయ్ నేను వెదకింది. చీకటిలో బ్రతుకంతా చిందులు త్రొక్కింది!

ఏమో నాకు..!ఎంత అనుభవమైనా, ఏ మాత్రమూ అర్థం కాదు. ఏం కోరాను? హాయిగా ఆటలు పాటలై అందాలు నిలిచే అమాయిక అసంసర్గ ప్రణయం....ఏం దొరికింది? నిలువెల్లా....విషం....దహించుకుపోతాను. కాని తరించలేక పోయినాను.... పోనీలే సాధనకు అంతేమిటి?

o o o

అంత సేపూ....ఎంత సేపైందో....నాకు తెలియలేదు. డాక్టరు వచ్చి....నే నింకా అక్కడే వుండటం వింతగా చూసి....ఆయాసం ఉబుకుతూన్న అతని వంక చూసి....గంభీర మర్యాదతో నాకు సెలవు యిచ్చాడు....మరునాడు అక్కడికి వెళుదామనుకుంటూండగా, ఏదో అవాంతరం వచ్చింది....అలా రెండు మూడు రోజులు గడచినవి....ఇక ఆ మీద వెళ్ళినా....ఎవరికోసం—

అతడు చెప్పిన దాంట్లో అబద్ధము ఏమన్నా వున్నదా, అంతా నిజమేనా?

అయితే నిజానికి నిజ స్వరూపం ఇంత బీభత్సంగా వుంటుందా ? నాకు అర్థం కాలేదంటే ఆశ్చర్యమేముంది? అతనికి....అతడు ఎంతవరకూ అంతు చిక్కాడు ?

అర్ధణా కాఫీ....అరగంట సేపు....అదీ యిదీ కావాలని కొసరి రెట్టించుకుని.... అంతలో కడుపు నించుకునే ఆ వాజలకు....పంతులు అంత తేలికగా అర్థమయే వాడా ?....

అందుకోసం....అన్నాళ్ళకు..అతని ప్రశంస వచ్చి....ఆ జవాబులు చూసి.. నేనలా ఫక్కున నవ్వింది!